క్లుప్తంగా

ఎమ్మెల్యేకు వినతి

రఘునాథపల్లి: మండలంలోని అంథ్రతండా అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ బానోత్ బన్‌సూర్య గ్రామపెద్దలతో కలిసి ఎమ్మెల్యే రాజయ్యకు వినతి పత్రం అందజేశారు. శనివారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వారాల రమేష్ ఆధ్వర్యంలో హనుమకొండలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. తమ వినతికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని సర్పంచ్ తెలిపారు. ఉప సర్పంచ్ నెతావత్ వీరన్న, బీఆర్ఎస్ నాయకులు తాటికొండ వెంకటేష్‌యాదవ్, శివరాత్రి రాజు, సంపత్ ఉన్నారు.

చర్య తీసుకోవాలి



ప్రకృతి వనం చుట్టూ ధ్వంసమైన కంచె

బచ్చన్నపేట: మండలంలోని బోనకొల్లూర్‌లో పల్లె ప్రకృతి వనం చుట్టూ ఉన్న ముళ్ల కంచెను, రాతి కసీలను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ మీస ఐలుమల్లయ్య అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ గ్రామ చివరలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ భూమిలో పల్లెప్రకృతి వనాన్ని నిర్మించి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశామన్నారు. రాత్రి వేళ గుర్తు తెలియని వ్యక్తులు తొమ్మిది కసీలను విరుగగొట్టి చుట్టూ ఉన్న ముళ్ల కంచెను తొలగించారని తెలిపారు. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశామని సంబంధిత అధికారులు చొరవ తీసుకొని చర్య తీసుకోవాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి ధర్మ సతీష్‌రెడ్డి, గ్రామస్తులతోపాటు తదితరులు పాల్గొన్నారు.

రేపు వేలం

చిల్పూరు: చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 6వ తేదీన ఉదయం 10 గంటలకు నిర్వహించే వేలం పాటలో పాల్గొని ఆలయ ఆదాయానికి సహకరించాలని ఈఓ లక్ష్మీప్రసన్న కోరారు. ఆలయ ప్రాంగణంలో శనివారం ఈఓ, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఆలయ ప్రధాన అర్చకుడు రవీందర్‌శర్మ, అర్చకుడు రంగాచార్యులతో కలిసి మాట్లాడారు. ఈనెల 6న ఉదయం 10 గంటలకు ఆలయానికి సంబంధించిన వివిధ వస్తువులను ఏడాది పాటు విక్రయించేందుకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా పేర్లు నమోదు చేసుకొని ధరావత్తు సొమ్ము చెల్లించాలని పేర్కొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



పాలకుర్తి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు శనివారం మహాత్మా హెల్పింగ్ హాండ్ వ్యవస్థాపకుడు గంటా రవీందర్ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు. హెచ్ఎం శోభారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు కాంగ్రెస్ అండ



బచ్చన్నపేట: కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని పని చేస్తున్న కార్యకర్తల కుటుంబాలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వంచ వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నక్కవానిగూడెం గ్రామానికి చెందిన కార్యకర్త బొట్టు రామమ్మ, తమ్మడపల్లికి చెందిన మోత్కూరి యాదగిరి మృతి చెందడంతో బాధిత కుటుంబ సభ్యులకు టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య ఆదేశాల మేరకు బియ్యం అందజేశారు. నిడిగొండ శ్రీనివాస్, ఎల్లయ్య, శ్రీనివాస్, రాజు, ఐలయ్య, మహాత్మాచారి, కరుణాకర్‌రెడ్డి, కుమార్, శ్రీనివాస్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని నమిలిగొండ శివారు మోడల్ స్కూల్ వద్ద డంపింగ్‌యార్డు సమీపాన పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి రూ.5,010 నగదు, ఐదు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ రాజమౌళి తెలిపారు. పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేయగా మోడల్ స్కూల్ సమీపాన డంపింగ్ యార్డు వద్ద పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు చెప్పారు. చెన్నూరి శివలింగం, చిక్కుడు వెంకటేష్, యతిరాజుల సురేష్, చెన్నూరి వేణు, గాదె ప్రేమ్‌కుమార్, కత్తెరశాల దయాకర్, చెన్నూరి వెంకటేష్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

సమస్యల వలయంలో బస్టాండ్

- స్టేషన్‌ఘన్‌పూర్ బస్టాండ్‌లో పనిచేయని టీవీలు, ఫ్యాన్లు
- ఆగని డీలక్స్ బస్సులు



స్టేషన్‌ఘన్‌పూర్ బస్టాండ్

స్టేషన్‌ఘన్‌పూర్: జిల్లా కేంద్రం తర్వాత ఆ స్థాయిలో పేరున్న డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్ బస్టాండ్ సమస్యల వలయంలో ఉన్నా సంబంధిత అధికారులు, పాలకులకు ఏమాత్రం పట్టడం లేదు. జిల్లాలో రెండో ప్రాధాన్యత ఉన్న ఘన్‌పూర్ బస్టాండ్‌లో ఆరు ప్లాట్‌ఫారాలుండగా ప్రతీ రోజూ నిత్యం వందలాది మంది ప్రయాణికులు వస్తుంటారు. బస్టాండ్‌లో పనిచేయని టీవీలు, ఫ్యాన్లు, అపరిశుభ్ర పరిసరాలు, ఆగని డీలక్స్ బస్సులు, ఇష్టారాజ్యంగా వస్తువుల ధరలు తదితర సమస్యలు నిత్యం ప్రయాణికులను వేధిస్తున్నాయి.

ఆగని డీలక్స్ బస్సులు

ఘన్‌పూర్ పేరుకు డివిజన్ కేంద్రమైనప్పటికీ ఇక్కడ డీలక్స్ బస్సులకు హాల్టింగ్ లేదు. అదేవిధంగా రాత్రి వేళల్లో ఎక్స్‌ప్రెస్ బస్సులను ఆపడం లేదు. ఘన్‌పూర్ నుంచి హనుమకొండ, జనగామ, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు ఉద్యోగాలు, వ్యాపార విషయమై వందల సంఖ్యలో ప్రతీరోజూ అప్ అండ్ డౌన్ చేస్తున్నారు. రాత్రివేళల్లో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు తమ ఆక్యుపెన్సీని పెంచుకోవడానికి హనుమకొండ బస్టాండ్‌లో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో కేవలం జనగామ వెళ్లేవారినే బస్సులోకి అనుమతిస్తుండగా తప్పనిసరి పరిస్థితుల్లో ఘన్‌పూర్‌కు వచ్చేవారు జనగామకు టికెట్ తీసుకుని ఘన్‌పూర్‌లో దిగాల్సి వస్తుంది. అధిక ధరలు వెచ్చించలేని ప్రయాణికులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు.

పనిచేయని టీవీలు, ఫ్యాన్లు

ఘన్‌పూర్ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన టీవీలు, ఫ్యాన్లు కేవలం అలంకార ప్రాయంగా మారాయి. అధునాతన పద్ధతిలో టీవీలు ఏర్పాటు చేసిన ఆర్టీసీ అధికారులు వాటి విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండగా అలంకార ప్రాయంగా మారాయి. దీంతో గంటల తరబడి బస్టాండ్‌లో వేచిఉండే ప్రయాణికులు ఆహ్లాదం కోసం టీవీలు చూసే పరిస్థితి లేదు. ఫ్యాన్ల సౌకర్యం లేక ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. అదేవిధంగా బస్టాండ్ పరిసరాలు పూర్తిగా అపరిశుభ్రంగా మారినా పట్టించుకునేవారు లేరు. బస్టాండ్ ప్రాంగణంలోని స్టాళ్లలో విక్రయించే వస్తువులను ఇష్టారాజ్యంగా ఎమ్మార్పీ ధరల కన్నా అధికంగా విక్రయిస్తున్నారు. ఆర్టీసీ వారు మెరుగైన సేవలు అందిస్తున్నారు.. సద్వినియోగం చేసుకోవాలని ఊదరగొట్టు ప్రచారం చేసే ఆర్టీసీ అధికారులు బస్టాండ్ ప్రాంగణాల్లో సమస్యలపై దృష్టి సారించడం లేదు. ఈ విషయమై సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి బస్టాండ్‌లో నెలకొన్న సమస్యల్ని పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రుణాలు రెన్యువల్ చేసుకోవాలి



మాట్లాడుతున్న పూర్ణచందర్

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బ్యాంకులో తీసుకున్న రుణాలను రెన్యువల్ చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ పులిగిల్ల పూర్ణచందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ భవనంలో ఆయన మాట్లాడుతూ బ్యాంకులో 26 జీపీల నుంచి 1,285 మంది సభ్యత్వాలను తీసుకున్నారని అన్నారు. స్వల్ప కాలిక రుణాలు రూ.7 కోట్లు, దీర్ఘకాలిక రుణాలు రూ.87 లక్షలను తీసుకున్నారని తెలిపారు. రుణాలు తీసుకున్న రైతులు వాయిదాలు సకాలంలో చెల్లిస్తే కొత్త రైతులకు రుణాలను అందించే అవకాశం ఉంటుందన్నారు. సీఈఓ బాలస్వామి, డైరెక్టర్లు, సిబ్బంది నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

33/11 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు



మాట్లాడుతున్న ఎంపీపీ నాగిరెడ్డి

పాలకుర్తి టౌన్: పాలకుర్తి మండలం తొర్రూరులో రూ. 2.8 కోట్లతో 33/11 సబ్ సేష్టన్ మంజూరు చేసినందుకు మంత్రి ఎర్రబెలి దయాకర్‌రావుకు ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, జెడ్పీ ఫ్లోర్ లీడర్ పుస్కూరి శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాయలంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తొర్రూరు పరిధిలో చుట్టుఉన్న గ్రామాలకు చెందిన రైతులు లో ఓల్టేజ్ సమస్యతో బాధపడుతుండగా మంత్రికి తెలియజేయడంతో ప్రత్యేక చొరవ తీసుసుకొని 33/11 కేవీ సబ్ సేష్టన్ మంజూరు చేశారని తెలిపారు. సర్పంచ్ వీరమానేని యాకాంతరావు, దేవస్థానం చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్యశర్మ, ఎండీ మదార్,ముస్కు రాంబాబు. బీఆర్ఎస్ నాయకులు మచర్ల ఎల్లయ్య, పాము శ్రీను పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పరామర్శ

దేవరుప్పుల: మండల కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగి జోగు కొమురయ్య మృతి చెందాడు. కాగా, కొమురయ్య కుటుంబాన్ని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శనివారం రాత్రి పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. అనంతరం కొడకండ్ల మండలం బోడోనికుంట సర్పంచ్ సోమాని భార్య కమల అనారోగ్యంతో మృతి చెందగా ఆ కుటుంబాన్నీ పరామర్శించారు.

బోడోనికుంట తండాలో..

కొడకండ్ల: మండలంలోని బోడోనికుంట తండా సర్పంచ్ బానోత్ సోమాని సతీమణి కమల అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందింది. కాగా, విషయం తెలుసుకున్న మార్కెట్ చైర్మన్ పేరం రాము, ఈజీఎస్ డైరెక్టర్ యాకయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సిందె రామోజీ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పసునూరి మధుసూదన్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు గ్రామానికి వెళ్లి కమల మృతదేహానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

షాపల్లిలో..

జఫర్‌గఢ్: షాపల్లికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎనగందుల గిరిధర్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాజయ్య పార్టీ బృందంతో కలిసి శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఎంపీపీ రడపాక సుదర్శన్, జెడ్పీటీసీ సభ్యురాలు బేబి శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, ఎంపీటీసీ శివయ్య ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

జఫర్‌గఢ్: కడియం ఫౌండేషన్ సహకారంతో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లను కడియం యువసేన ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు శనివారం ఆవిష్కరించారు. నాయకులు కర్ణాకర్‌రావు, రాజేష్‌నాయక్, అశోక్, వెంకటస్వామి, సంపత్‌రెడ్డి, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

నివాళి

రఘునాథపల్లి: మండలకేంద్రానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు గండికోట సమ్మయ్య శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాసమల్ల కొమురయ్య శనివారం సంఘం నాయకులతో కలిసి రఘునాథపల్లికి చేరుకొని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పేదరికానికి చెందిన మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వాతాల యాదగిరి, నాయకులు తూడి అంజయ్య, చిన్నపాక రత్నం, పల్లపు మురళి, మహేందర్, చిన్న సమ్మయ్య, శేఖర్, నరసింహులు, పెద్దకుమార్ ఉన్నారు.

విరాళం



చిల్పూరు: మండలంలోని నష్కల్ రామాలయ పుష్కరిణి పునః నిర్మాణానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాదాసి వెంకటేష్-రేణుక దంపతులు శనివారం ఆలయ ప్రాంగణంలో రూ. 1.25 లక్షల చెక్కును సనాతన ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు పోలోజు జంపయ్యచారికి అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు పెండ్యాల దిలీప్ రూ. 10 వేల విరాళం అందజేశారు. అర్చకులు ఆరుట్ల సింగరాచార్యులు, ఓదెల రమాదేవి-ఎల్లయ్యగౌడ్, గణపురం నర్సయ్యశర్మ, ఇమ్మడి లక్ష్మణ్, గంటె సాంబమూర్తి, మోడెం గణేష్, పోలోజు ఎల్లయ్య, కనకటి విష్ణు, మెరుగు సాయిప్రసాద్, నంగునూరి భిక్షపతి పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

దేవరుప్పుల: దేశవ్యాప్తంగా అంబానీ, ఆదానీల కంపెనీల వ్యవహారంపై నిగ్గు తేల్చేందుకు అధిష్టానం పిలుపు మేరకు రేపు జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ, ఎస్‌బీఐ ఆఫీస్‌ల ఎదుట తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి కోరారు.

నిరుద్యోగ భృతి చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జనగామ రూరల్: రాష్ట్రంలోని యువతకు నిరుద్యోగ భృతి చెల్లించి వారిని ఆదుకోవాలని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బనుక శివరాజ్ అన్నారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర అధ్యక్షుడు శివసేన రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టరేట్‌లో ఏఓకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం గత ఎన్నికల్లో యువతకు ఇచ్చిన హామీ నిరుద్యోగ భృతి రూ.3,016 చెల్లించాలని కోరారు. ఈ అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో యువతకు గత 4 సంవత్సరాల నుంచి బకాయి ఉన్న రూ. 1.44 లక్షలు వెంటనే మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దాసరి క్రాంతి, అనిల్, ప్రకాష్, సంపత్, హరీష్ పాల్గొన్నారు.

హరినామస్మరణతో భక్తి భావం పెంపొందుతుంది



జనగామ రూరల్: హరినామ స్మరణతో జీవుల్లో భక్తి భావం పెంపొందుతుందని ఇస్కాన్ హరేకృష్ణ భక్త బృందం నిర్వాహకుడు ధనుంజయ పండిత్ దాస్ అన్నారు. శనివారం నిత్యానంద ప్రభువు జన్మదినం సందర్భంగా పట్టణంలోని గీతాశ్రమంలో హరినామ కీర్తనలు, ప్రవచనాలు బోధించారు. పండరీపురి దాస్, సనాతన్ దాస్, పద్మావతి, సుభాంగినీ, స్వరూపిని, బాలనారాయణ, ప్రభాకర్, రాజేష్, భక్తులు పాల్గొన్నారు.

నిధుల మంజూరు



చిల్పూరు: మండలంలోని మల్కాపూర్‌లో తాగు నీటి సమస్య పరిష్కారానికి జెడ్పీ నుంచి రూ. 2 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు వెన్నం మాధవరెడ్డి, మంతెన చినరాజులకు ప్రొసీడింగ్ కాపీని అందజేశారు.

పంటలకు సాగునీరు అందించాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రస్తుత సీజన్‌లో నీటి ఎద్దడి లేకుండా పంటలు ఎక్కడా ఎండిపోకుండా తగిన ఏర్పాట్లు చేస్తూ సరిపడా సాగునీరు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. హనుమకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలో ఉన్న రిజర్వాయర్లపై ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో సాగునీటి ఎద్దడి లేకుండా పంటలు ఎండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరం ఉన్న చోట నీటిని విడుదల చేయాలని, నీటి విడుదలలో జాప్యం చేయొద్దన్నారు. గండిరామారం లిఫ్ట్ ద్వారా మెట్ట ప్రాంతాలైన పీచర, వేలేరు, పక్కన ఉన్న తండాలు, అదేవిధంగా ధర్మసాగర్ మండలంలోని ముప్పారం, నారాయణగిరి గ్రామాలకు సాగునీరు అందించేలా గండిరామారం లిఫ్ట్ పనులను ప్రారంభించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లా ఇరిగేషన్ ఈఈ వినయ్‌బాబు, డీఈ రామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తండాలకు రూ.17.67 కోట్లు

నియోజకవర్గంలోని గిరిజన తండాలకు మౌలిక వసతుల కల్పనలో భాగంగా రవాణా సదుపాయాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి ఐటీడీఏ ద్వారా రూ.17.67 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. ఏనబావి నుంచి పిట్టలోనిగూడెం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2.07 కోట్లు, గోవర్ధనగిరి జాతీయ రహదారి నుంచి మచ్చుపహాడ్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.11.90 కోట్లు, సోమయ్య కుంటతండా నుంచి నక్కబొక్కల తండా వరకు బీటీరోడ్డు నిర్మాణానికి రూ.3.70 కోట్లు మంజూరు అయ్యాయన్నారు. నియోజకవర్గంలోని గిరిజన తండాల్లో మౌలిక వసతుల కల్పన కోసం రూ.17.67 కోట్లు నిధులు మంజూరీ చేసిన రాష్ట్ర స్త్రీ, శిశు, గిరిజన సంక్షేమ, ఐటీడీఏ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్‌కు ఎమ్మెల్యే రాజయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం



వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కొడకండ్ల: రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ విజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఉపేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదల పక్షపాతిగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం, రైతుల రుణాల కోసం రూ.20 లక్షల కోట్లు కేటాయించడం హర్షనీయమన్నారు. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక రైతులకు సబ్సిడీలను ఎత్తివేసిందని, రుణమాఫీ అమలు చేయలేదని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించడం లేదన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు లేగ రామ్మోహన్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, కన్నయ్య, రాయుడు, వెంకన్న, సాయిదుర్గ, రాములు, నాగయ్య, ఆంజనేయులు, అజయ్ పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ' సేవలను వినియోగించుకోవాలి



కోడిగుడ్లు అందజేస్తున్న వెంకటస్వామి

జఫర్‌గఢ్: అంగన్‌వాడీ కేంద్రాలు అందించే సేవలను అందరూ వినియోగించుకోవాలని ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎడ్ల వెంకటస్వామి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని రఘునాథపల్లిలో అంగన్‌వాడీ సెంటర్లలో నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వెంకటస్వామి హాజరై మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్యంగా ఉండాలంటే అంగన్‌వాడీ సరుకులను తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. అనంతరం బాలింతలు, గర్భిణులు, పిల్లలకు కోడిగుడ్లు నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సదాశివరావు, అంగన్‌వాడీ టీచర్లు సరస్వతి, సుగుణతో పాటు ఆయాలు, ఆశవర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో ముందుకెళ్లాలి



లైఫ్ స్కిల్‌పై అవగాహన కల్పిస్తున్న వాసునాయక్

జనగామ రూరల్: విద్యార్థులు తమ ఆశయ సాధనకు పట్టుదలతో ముందుకెళ్లాలని ఇంపాక్ట్ మోటివేటర్ బి.వాసునాయక్ అన్నారు. శనివారం జిల్లాలోని చంపక్‌హిల్స్ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో గిరిజన శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు లైఫ్ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా స్కిల్స్ నేర్చుకోవాలని.. దీంతో జీవితంలో ఏదో ఒకరంగంలో స్థిరపడవచ్చని అన్నారు. తమ లక్ష్య సాధనకు టైమ్ మేనేజ్‌మెంట్, గోయల్ సెట్టింగ్ వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. హెచ్ఎం రాధ, సోమ్లా, రతన్‌సింగ్, సరోజన, రాములు, రాములు, రాజయ్య, సారయ్య, ఉపేందర్, వీరన్న పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌తో పేదలకు మేలు



మాట్లాడుతున్న రమేష్

జఫర్‌గఢ్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు మేలు చేసేలా ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఊడుగుల రమేష్ అన్నారు. మండలంలోని ఉప్పుగల్లులో పార్టీ మండల కార్యవర్గ సమావేశం మండల అధ్యక్షుడు తౌటి సురేష్‌గౌడ్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు మేలు జరిగేలా ఉందన్నారు. ముఖ్యంగా రైతుల రుణాల కోసం రూ.20 లక్షల కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. మోసపూరిత మాటలతో బీఆర్ఎస్ ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పార్టీ పార్లమెంట్ కోకన్వీనర్ యుగేందర్ రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ అంజిరెడ్డి, ఎండి వలిపాష, బుర్ర తిరుపతిగౌడ్, యాకస్వామి, కోరుకొప్పుల నాగేష్‌గౌడ్, యాకస్వామి, సంపత్‌రెడ్డి, లింగస్వామి, రాకేష్, సందీప్, మహేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



స్వయం పాలన దినోత్సవంలో విద్యార్థులు

జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వయం పాలన దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్ఎం ఎండి పర్వేజ్ మాట్లాడుతూ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పాఠాలు బోధించడంతోపాటు ప్రతిభను చూపడం అభినందనీయమన్నారు. ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ ఎల్లాచారి, రాజిరెడ్డి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రమేష్‌బాబు, చంద్రమోహన్, రవి, రాజేందర్, స్వరూపరాణి, కరుణశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

అసంపూర్తిగా డబుల్ బెడ్రూం ఇళ్లు



అక్కరాజుపల్లిలోని డబుల్ బెడ్రూం ఇళ్లు

తరిగొప్పుల: పేదలకు గూడు కల్పించి.. ప్రతీ ఒక్కరి కుటుంబం ఆత్మగౌరవంతో జీవించాలనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకం డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం. అందులో భాగంగా 2017లో మండలంలో అక్కరాజుపల్లిలో చేపట్టిన 30 డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం ఏళ్లు గడుస్తున్నా అసంపూర్తిగా మిగిలాయి. నిర్మాణ పనులు పూర్తయినా తుది పనులకు మాత్రం నీలిసీడలు తొలగడం లేదు. దర్వాజలకు, కిటికీలకు తలుపులు బిగించలేదు. నిత్యావసరాల వినియోగానికి నీటి వసతి కల్పించలేదు. అదేవిధంగా ఇళ్లకు రంగులు వేయలేదు. ప్లంబింగ్ పనులు సైతం పెండింగ్‌లో ఉన్నాయి. ఇదంతా పట్టనట్టు అధికారులు మాత్రం లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభలు నిర్వహించడం, ప్రతీ ఇంటికి నంబర్లు వేయడం జరిగింది. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసిన తర్వాతనే గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

సొంత డబ్బులతో తలుపులు అమర్చుకున్నారు..

పల్లె ప్రగతిలో భాగంగా గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న పెంకుటిళ్లను కూల్చివేసి అందులోని వారిని డబుల్ బెడ్రూం ఇళ్లలో ఉండమన్నారు. దాంతో వారు సొంత డబ్బులతో తలుపులు అమర్చుకున్నారు. పనులు పూర్తి చేయకుండానే ఇళ్లకు నంబర్లు కేటాయించారు.

- గోరంతల వీరన్న, గ్రామస్తుడు